సాక్షి
విజయనగరం

శనివారం । 31 । ఆగస్టు । 2024



సన్న బియ్యానికి సున్నం..!

గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం తొలగిస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. - 8లో



ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

జిల్లాలో ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. - 8లో



మడ్డువలసలో చిక్కుకున్న మత్స్యకారులు - 8లో

వంగర మండల పరిధిలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో నలుగురు మత్స్యకారులు శుక్రవారం చిక్కుకున్నారు.

న్యూస్‌రీల్

వచ్చేనెల 2న వైఎస్సార్ వర్ధంతి

- జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాల నిర్వహణ
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను వచ్చేనెల 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వార్డు, గ్రామ, మండల, మున్సిపల్, నియోజకవర్గ స్థాయిలో మహానేత వర్ధంతి నాడు ఆయన విగ్రహాలకు నివాళులర్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

వచ్చేనెల 3న పీహెచ్‌సీల వద్ద ధర్నా

- ఆశ వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధారాణి

విజయనగరం ఫోర్ట్: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 3న పీహెచ్‌సీల వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఆశవర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొత్స సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ వర్కర్లకు పనిభారం తగ్గించాలని, రికార్డులు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచి జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి నిరసనగా ఆదేరోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలపాలన్నారు.

జిల్లా ప్రత్యేక అధికారిగా వినయ్‌చంద్

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగా విజయనగరం జిల్లాకు యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్‌ను నియమించిందన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం చేసి ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యం నెరవేర్చేందుకు ప్రత్యేక అధికారులు తోడ్పడతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు వెల్లడించారు.

గిరిజన వర్సిటీ పనులు ఇక వేగవంతం



రోడ్డు నిర్మించనున్న స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుధారాణి

దత్తిరాజేరు: చినమేడపల్లి–మర్రివలస రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న గిరిజన యూనివర్సిటీ పనులు ఇక వేగవంతం చేస్తామని బొబ్బిలి ఆర్డీఓ సుధారాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జాతీయ రహదారి నుంచి యూనివర్సిటీకి 120 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి మొదట ప్రతిపాదించిన స్థలాన్ని, ప్రస్తుతం ఉన్న రోడ్డును పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు పక్కగా కొత్త రోడ్డు వేయడం వల్ల దూరం తగ్గుతుందని సర్వేయర్, తహసీల్దార్లు ఆమెకు వివరించారు. దీంతో భూ యజమానితో మాట్లాడి రోడ్డు వేసేందుకు ఒప్పిద్దామన్నారు. సాయంత్రం భూయజమాని ఆర్డీఓను కలిశారు. ఆయన తోటలో ఉన్న విద్యుత్ టవర్లను ప్రభుత్వ స్థలంలో వేయిస్తే రోడ్డు నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు అభ్యంతరం లేదని చెప్పినట్టు తెలిసింది. కార్యక్రమంలో దత్తిరాజేరు, రామభద్రపురం తహసీల్దార్లు విజయభాస్కర్, సులోచనారాణి, సర్వేయర్ తిరుపతిరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వారి రూటే సెపరేటు..!



- పదోన్నతిపై బదిలీ అయినా డిప్యుటేషన్‌పై మళ్లీ అదే స్థానంలో విధులు
- ఏపీవీవీపీలో కొనసాగుతున్న డిప్యుటేషన్ల పర్వం
- డబ్బులిచ్చేవారికి నచ్చిన స్థానానికి డిప్యుటేషన్!
- చక్రం తిప్పుతున్న కొంతమంది ఉద్యోగులు!
- విధుల్లో జాప్యం.. ప్రజలకు తప్పని ఇబ్బందులు

'విజయనగరం జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఓ ఉద్యోగిని ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ఏరియా ఆస్పత్రికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై బదిలీ చేశారు. ఆయన సాలూరు ఆస్పత్రిలో పట్టుమని 10 రోజులు కూడా పనిచేయకుండా డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చేశారు. ఆయనను చూసిన వైద్య విధాన్ పరిషత్ ఉద్యోగులంతా అవాక్కయ్యారు.'

'గజపతినగరం ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే నాల్గో తరగతి ఉద్యోగిని డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై తెచ్చారు. వాస్తవంగా సదరు ఉద్యోగి చేయడానికి ఇక్కడ విధులు లేవు. ఎందుకంటే డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఇద్దరు అటెండర్లు ఉన్నారు.'

- చీపురుపల్లి సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగిని భోగాపురం సామాజిక ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు.'
- ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులను డిప్యుటేషన్‌పై నెల్లిమర్ల సీహెచ్‌సీలో నియమించారు.
- చీపురుపల్లి ఆస్పత్రిలో పనిచేసే ఓ వైద్యుడిని డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి కొద్ది రోజుల కిందట డిప్యుటేషన్ వేశారు. దీనివల్ల అక్కడ వైద్య సేవలు అందని పరిస్థితి.

విజయనగరం ఫోర్ట్: వైద్యవిధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో కొద్దిరోజులుగా డిప్యుటేషన్ల పర్వం నడుస్తోంది. ఉన్నతాధికారులు, పాలకులకు కావాల్సిన వారు... అమ్యామ్యాలు భారీగా సమర్పించుకునే వారికైతే నచ్చినచోట విధులు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు సమాచారం. పదోన్నతిపై బదిలీ అయినా పది రోజుల్లోనే మళ్లీ యథాస్థానానికి వచ్చేస్తున్నారు. వాస్తవంగా బదిలీ అయిన ఆస్పత్రిలో విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉన్నా అవసరం లేని చోటకు మళ్లీ డిప్యుటేషన్‌పై వస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగుల డిప్యుటేషన్లకు సంబంధించి డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి ఒకరు చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన చేతుల మీదుగానే డబ్బులు చేతులుమారుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు చేయడంపై ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. స్థానికంగా పనిచేసే ఉద్యోగుల విధులకు అటంకం కలగడంతో పాటు పనిభారంతో సతమతమవుతున్నారు. ప్రజలకు సేవలందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే విషయాన్ని డీసీహెచ్‌ఎస్ బి.గౌరీశంకర్ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యుటేషన్లు చేసినట్టు తెలిపారు. ఆయా ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొంతమందికి డిప్యుటేషన్లు చేసినట్టు వెల్లడించారు.



జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి వారి కార్యాలయం

ఆ మృతదేహం ఎవరిది..?



ఆధారాలు సేకరిస్తున్న పోలీస్ క్లూస్‌టీం

- రేగిడిపేట తోటల్లో గుర్తుతెలియని మృతదేహం
- తల, కాళ్లు, చేతులను పురుగులు తినేసిన వైనం
- మృతుడి ఫ్యాంట్ జేబులో మొబైల్ ఫోన్
- హత్యా?ఆత్మహత్యా? అనే కోణంలో దర్యాప్తు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

చీపురుపల్లి: ఆ మృతదేహం అక్కడ పడి ఉండి దాదాపు వారం రోజులై ఉండవచ్చు. ఎవ్వరూ సంచరించని ప్రదేశం.. దాదాపు 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని యువకుని మృతదేహం తల, కాళ్లు, చేతులను పురుగులు తినేశాయి.. హత్యా? ఆత్మహత్యా? అన్నది తెలియదు. శుక్రవారం వెలుగుచూసిన మొండెం నుంచి శరీరం భాగం మాత్రమే మిగిలి ఉన్న మృతదేహం ఈ ప్రాంతీయుల్లో కలకలం రేపింది. చీపురుపల్లి ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రేగిడిపేట సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.శంకరరావు, ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పసుపు, నలుపు రంగు చారలతో కూడిన టీషర్ట్, బ్లూ రంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. అప్పటికే ఆ మృతదేహానికి సంబంధించిన తల, కాళ్లు, చేతులు కనిపించకపోవడంతో పురుగులు తినేసి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. మృతుని ఫ్యాంట్ జేబులో మొబైల్ ఫోన్, ఖైనీ ప్యాకెట్‌ను గుర్తించారు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేదంటే ఎవరైనా హత్య చేసి అక్కడ పడేసి ఉంటారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం నుంచి వచ్చిన పోలీస్ క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. మొబైల్‌లో ఐఎంఈఐ నంబర్ ద్వారా మృతుని వివరాలు సేకరిస్తామని, అంతవరకు గుర్తు తెలియని మృతదేహంగానే భావిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అవ్వాతాతలపై కాల'కూటమి'విషం



శివ్వాం సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు

- రెండు నెలల్లో 2,351 మంది పింఛన్ల రద్దు
- శివ్వాం సచివాలయం వద్ద ఆందోళనకు దిగిన లబ్ధిదారులు

విజయనగరం అర్బన్/వంగర: ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్టే.. ఆయన పేరుతో ఇచ్చే సామాజిక పింఛన్ లబ్ధిదారులపై రాజకీయ కక్షసాధింపు చర్యలను చంద్రబాబు సర్కారు కొనసాగిస్తోంది. జిల్లాలో కేవలం రెండు నెలల్లో 2,351 మంది అవ్వాతాతల పింఛన్లను రద్దుచేసి ఆవేదనకు గురి చేసింది. కూటమి కార్యకర్తల కక్షసాధింపు ఫిర్యాదుల ఆధారంగా పింఛన్ల తొలగింపుపై సర్వత్రా ఆందోళన నెలకొంది. జూలై నెలలో 2,81,713 మందికి పింఛన్లు అందగా.. ఆగస్టు నెలకు వచ్చేసరికి 1,361 మందివి రద్దుచేసి 2,80,352 మందికి పింఛన్లు ఇచ్చారు. ఆగస్టు నెలలో ఇచ్చిన పెన్షన్‌లో 991 మందివి రద్దు చేసి తాజాగా శనివారం పంపిణీ చేస్తున్న సెప్టెంబర్ నెలకు 2,79,361 మందికి మాత్రమే పింఛన్లు ఇస్తున్నట్లు అర్హుల జాబితాను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విడుదల చేశారు.

పింఛన్లు తొలగిస్తే ఉద్యమిస్తాం

వంగర మండల పరిధి శివ్వాం గ్రామంలో గడిచిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న నెపంతో టీడీపీ నేతలు కక్షగట్టారు. పలువురు లబ్ధిదారుల పింఛన్లను రద్దుచేయాలంటూ టీడీపీ నాయకుడు, పార్టీ మండలాధ్యక్షుడు పిన్నింటి మోహనరావు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయాలని ఎంపీడీఓకు డీఆర్‌డీఏ పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే 48 మంది దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు మండల పరిషత్ కార్యాలయం ద్వారా నోటీసులు అందజేశారు. స్థానిక సచివాలయంలో ఎంపీడీఓ లోపింటి త్రినాథ్ దర్యాప్తు చేపట్టేందుకు వెళ్లారు. అక్కడకు ఫిర్యాదుదారుడు రాలేదు. లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించేందుకు వచ్చిన అధికారుల ముందు పింఛన్‌దారులు బైఠాయించి ఆందోళన చేశారు. అర్హుల పింఛన్లు తొలగిస్తే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. తప్పుడు ఫిర్యాదులకు నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. పదేళ్ల నుంచి పింఛన్లు తీసుకుంటుంటే ఇప్పుడు రద్దు చేస్తారా అంటూ ప్రశ్నించారు. వీరికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బొక్కేల వెంకట అప్పలనాయుడు, సత్యంనాయుడు మద్దతు పలికారు. ఏఎస్‌ఐ పి.ప్రసాద్ పింఛన్‌దారులకు సర్దిచెప్పి పంపించేశారు. అనంతరం ఫిర్యాదుదారుడు లేకపోవడంతో ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది అక్కడ నుంచి వెనుదిరిగారు.



ఫిర్యాదుదారుడు హాజరుకాకపోవడంతో ఖాళీగా కూర్చున్న దర్యాప్తు అధికారులు

- నిమ్మకాయల అలంకరణలో

కనకమహాలక్ష్మి



చీపురుపల్లి పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారు నిమ్మకాయల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం కావడంతో అమ్మవారిని నిమ్మకాయలతో అర్చకులు అలంకరించారు. సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– చీపురుపల్లి

గణపతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: గణపతి ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి మీసేవలో చలానా రుసుం చెల్లించి, నిరభ్యంతర పత్రం, క్యూఆర్‌కోడ్‌ను పొందాలన్నారు. సింగిల్ విండో విధానంలో వివరాలను పూర్తిచేసి అనుమతులు పొందాలని తెలిపారు. వాటిని లామినేషన్ చేయించి ఉత్సవాల పందిరి వద్దకు తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు.

● అనుమతుల దరఖాస్తు ఇలా..

ముందుగా గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ ఓపెన్ చేసి న్యూ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి. దరఖాస్తు చేస్తున్న వ్యక్తి ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ తర్వాత మొబైల్ నంబర్ వెరిఫికేషన్ పూర్తయి విండో ఓపెన్ అవుతుంది. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుని పేరు, ఈ మెయిల్ ఐడీ, అడ్రస్, అసోసియేషన్ పేరు, ఉత్సవం నిర్వహిస్తున్న స్థలం, గణపతి విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు తదితర వివరాలను నమోదుచేయాలి. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, వారి ఫోన్ నంబర్లు, నిమజ్జనం నిర్వహించే తేదీ, సమయం, వినియోగించే వాహనాల వివరాలు నమోదుచేయాలి. వివరాలను నమోదుచేసిన తర్వాత సంబంధిత అధికారులు ఉత్సవాలు నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చే తేదీ, సమయం, షెడ్యూల్ తెలియజేస్తారు. ఆన్‌లైన్‌లో సూచించిన మొత్తాన్ని మీసేవలో చలానా కట్టి, గణేష్ ఉత్సవ్ డాట్ నెట్/ అప్లికేషన్ స్టేటస్‌లో నేవిగేట్ అయి, దరఖాస్తుదారుని ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే అనుమతులు మంజూరు చేస్తూ నిరభ్యంతర పత్రం, పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ అవుతుంది. డౌన్‌లోడు చేసుకున్న నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ), నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ లేమినేషన్ చేసి, ఉత్సవ మండపంలో తనిఖీలు చేపట్టేందుకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలి.

జిల్లాలో పచ్చదనాన్ని పెంచుదాం

- అందరికీ ఉపయోగ పడేలా మొక్కలు నాటుదాం
- వనమహోత్సవంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, అధికారులు

నెల్లిమర్ల: జిల్లాలో అటవీ విస్తీర్ణం అతి తక్కువగా 6 శాతం మాత్రమే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 50 శాతం పచ్చదనం పెంచాలంటే జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగించాల్సి ఉందని రాష్ట్ర చిన్న పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా స్థాయి వనమహోత్సవం అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డెంకాడ మండలం బేతనాపల్లి వద్దనున్న నగరవనంలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సురేష్ బాబు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తదితరులు వేప, మామిడి, మద్ది, కానుగ, తదితర రకాల మొక్కలను నాటారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమం కేవలం ప్రభుత్వ స్థలాలకే పరిమితం చేయకుండా కాలనీలు, ఖాళీ స్థలాలు, ఇళ్ల వద్ద చేపట్టాలన్నారు. ప్రజలకు నిత్యజీవితంలో ఉపయోగపడే మొక్కలనే నాటాలని సూచించారు. తక్కువ నీటిని స్వీకరించి, తక్కువ నిర్వహణ వ్యయంతో పెరిగే మొక్కలనే ఎంపిక చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గాన్ని హరిత ప్రాంతంగా రూపుదిద్దుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ తాటిచెట్ల వల్ల పిడుగులు బారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని, అందువల్ల వాటిని తొలగించకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలిచ్చారన్నారు.

జిల్లాలో ఈ ఒక్కరోజే లక్ష మొక్కలు నాటుతున్నామని, ఏడాది పొడవునా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టేందుకు మరో 7 లక్షల మొక్కలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. డీఎఫ్‌ఓ ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా అటవీ విస్తీర్ణం 6 శాతం, మొత్తం పచ్చదనం 18శాతం ఉందని, దీనిని 50 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జిల్లాలో ఈ ఏడాది 50 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రజలకు ఉపయోగపడే 75 రకాల మొక్కలను పెంచి సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ పద్మావతి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, అటవీసిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, పాల్గొన్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే మాధవి, కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

శ్రావణ శోభ



నెమలి సింహాసనంపై భక్తులకు దర్శనమిస్తున్న వనంగుడిలోని పైడితల్లి అమ్మవారు



సంతోషిమాత ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



సంతోషిమాతకు 1100 కేజీల పసుపు కొమ్ములతో అర్చన

విజయనగరం టౌన్: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని పైడితల్లి అమ్మవారి ఆలయం భక్తులతో కళకళలాడింది. చదురుగుడి, వనంగుడిలలో అమ్మవారికి వేదపండితులు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అమ్మవారు నెమలి సింహాసనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో ఆలయ ఆవరణలో నిర్వహించిన కుంకుమార్చనలలో వందలాది మంది మహిళలు పాల్గొని పూజలు చేశారు. మయూరీ కూడలి వద్దనున్న సంతోషిమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. సంతోషిమాత అమ్మవారికి 1100 కేజీల పసుపు కొమ్ములతో సహస్రనామార్చన జరిపారు. మహా హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రమేష్ తివారీ నేతృత్వంలో భక్తులు విశేష పూజలు చేశారు.

నేడు, రేపు ఆదిభట్ల జయంతి వేడుకలు



- పద్మశ్రీ పురస్కార గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరికి సత్కారం

విజయనగరం టౌన్: ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకలను ఈ నెల 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో ఎం.ఆర్.లేడీస్ రిక్రియేషన్ వెల్ఫేర్‌క్లబ్ ఆవరణలో నిర్వహిస్తామని ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శుక్రవారం తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరి భాగవతారిణి (హైదరాబాద్)ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేతుల మీదుగా ఆదిభట్ల పురస్కారంతో శనివారం రాత్రి 7 గంటలకు సత్కరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఉదయం నుంచి నిర్వహించే ప్రత్యేక హరికథా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొంటారన్నారు. సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో విశాఖకు చెందిన బొంతల కోటి యతిరాజ భాగవతార్‌కు పురస్కారం అందజేస్తారని తెలిపారు. రెండురోజుల పాటూ నిర్వహించే కార్యక్రమాల్లో నగరవాసులు పాల్గొనాలని కోరారు.

సన్న బియ్యానికి సున్నం..!

- సార్టెక్స్ పంపిణీపై ప్రభుత్వం విముఖత
- క్యాబినెట్ సమావేశంలో ప్రతిపాదన
- గత ప్రభుత్వం పథకాలను తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం
- రూ.కోట్లు పెట్టి సార్టెక్స్ మిషనరీ సిద్ధం
- అయోమయంలో మిల్లర్లు

వీరఘట్టం:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం తొలగిస్తూ అన్ని వర్గాల ప్రజలపై భారం మోపుతూ ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రమంలో పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తూ అన్ని రైస్ మిల్లుల్లో సార్టెక్స్ మెషినరీ ఏర్పాటు చేయించి మిల్లర్లకు చేదోడుగా గత ప్రభుత్వం నిలిచింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇటీవల జరిగిన క్యాబినెట్‌లో సార్టెక్స్ బియ్యం పంపిణీకి మంగళం పాడేందుకు ప్రతిపాదించింది. సార్టెక్స్ విధానం వల్ల ప్రభుత్వానికి రూ.కోట్లలో ఖర్చవుతోందని, దీంతో పంపిణీ నిలిపివేసేందుకు రంగం సిద్ధం చేయాలని యోచిస్తోంది. అయితే కొందరు మంత్రులు మాత్రం సార్టెక్స్ బియ్యం పంపిణీ ఆపివేస్తే ప్రభుత్వానికి మిల్లర్లు వ్యతిరేకమవుతారని తెలపడంతో ప్రస్తుతం సార్టెక్స్ బియ్యం అంశం మిల్లర్లలో చర్చనీయాంశంగా మారింది.



సార్టెక్స్ మిషనరీ అమర్చిన ఓ రైస్ మిల్లు

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 93 రైస్ మిల్లులు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం వరకు అన్ని మిల్లుల్లో ఫోర్టిఫైడ్ బియ్యం తయారు చేసే మిషనరీ ఉండేది. ఫోర్టిఫైడ్ బియ్యం తినేందుకు అధికశాతం మంది ఇష్టపడకపోవ డంతో పాటు రేషన్ డిపోల ద్వారా తీసుకునే బియ్యాన్ని వెంటనే వ్యాపారులకు విక్రయించేవారు.ఇక ఇటువంటి పరిస్థితులు ఉండ కూడదని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని మిల్లులు నాణ్యమైన బియ్యం తయారు చేసే సార్టెక్స్ మిల్లులుగా మార్చాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని మిల్లరు 2022-23లో 28 మిల్లుల్లో సార్టెక్స్ మెషినరీ అమర్చారు. అలాగే 2023-24 లో 65 మిల్లుల్లో మిషనరీ అమర్చారు. ఒక్కో మిల్లర్ ఇందుకోసం రూ.70 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఖర్చు చేసి సాధారణ మిల్లులను సార్టెక్స్ మిల్లుగా మార్చారు. తమ ఆస్తులను బ్యాంకుల్లో తనఖా పెట్టి ప్రతి నెలా ఈఎంఐలు కడుతూ సార్టెక్స్ మిల్లులుగా మార్చి నాణ్యమైన బియ్యం తయారు చేసి ప్రభుత్వానికి అప్పగించారు.

గగ్గోలు పెడుతున్న మిల్లర్లు..

ఏటా రైతులు పండించే ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగిస్తుంది. మిల్లర్లకు ఇచ్చే ధాన్యానికి సరిపడా బ్యాంకు ష్యూరిటీని వారి దగ్గర తీసుకుని ధాన్యం ఇస్తారు. మళ్లీ ఈ ధాన్యం బదులు మిల్లర్ల నుంచి నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం సేకరించి, రేషన్ బియ్యంగా పేద ప్రజలకు అందజేస్తోంది. ఇప్పుడు ఈ నాణ్యమైన బియ్యం(సార్టెక్స్) విధానానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడాలని చూస్తుండడంతో మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి సార్టెక్స్ మిల్లులుగా రూపొందించాం. ఇప్పుడు వద్దంటే తమకు తీవ్ర నష్టం తప్పదని,అప్పులు చేసి మిల్లులు కడితే చివరకు కూటమి ప్రభుత్వంలో తిప్పలు తప్పేటట్లు లేవని వాపోతున్నారు. అయితే ఇంకా ఈ అంశంపై ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంపై మిల్లర్లు మండిపడుతున్నారు. సార్టెక్స్ విధానాన్ని కొనసాగించాలని వారంతా కోరుతున్నారు. మరి కూటమి ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని మిల్లర్లు వేచిచూస్తున్నారు.

సార్టెక్స్‌నే కొనసాగించాలి



కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సార్టెక్స్ వద్దంటే మిల్లర్లకు చాలా నష్టం తప్పదు. బ్యాంకులోను, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.లక్షల్లో అప్పులు చేసి గత ప్రభుత్వ హయాంలో సార్టెక్స్ మిషనరీ అమర్చి కొత్త మిల్లులను నిర్మించాం.ఇంకా ఆ అప్పులు తీరలేదు. ప్రతి నెలా వడ్డీలు కడుతున్నాం. అంతేకాక సార్టెక్స్‌కు అనుగుణంగా రూ.లక్షలు ఖర్చు చేసి విద్యుదీకరణ చేసాం. ప్రతి నెలా రూ.40 వేల వరకు కరెంటు బిల్లులు కడుతున్నాం. సార్టెక్స్ తీసేస్తే ఈ భారమంతా మిల్లర్లపై పడుతుంది. ప్రభుత్వం సార్టెక్స్‌ను కొనసాగించాలి.

పొట్నూరు గౌరీశంకరరావు,
జిల్లా రైస్ మిల్లర్ల సంఘం కన్వీనర్, పార్వతీపురం

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

తెర్లాం: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై సాగర్‌బాబు, సిబ్బంది గురువారం సాయంత్రం పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం తెలిపారు. చీపురుపల్లికి చెందిన వ్యక్తులు ట్రాక్టర్‌లతో వంతరాం వేగావతి నది నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తీసుకు వెళ్లేందుకు వారి దగ్గర ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే ఇసుకను ట్రాక్టర్లపై తీసుకువెళ్లాలని, అనుమతి పత్రాలు లేకపోతే ఇసుక తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్



గంజాయితో పట్టుబడిన వారితో డీఎస్పీ, సీఐ

బొబ్బిలి: ఒడిశా నుంచి బొబ్బిలి, బొబ్బిలి నుంచి బెంగుళూరు నగరానికి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టుచేశామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కొన్నేళ్లుగా పట్టణంలోని వ్యక్తులకు గంజాయి సరఫరా చేస్తున్న 5గురు వ్యక్తులను ఈనెల 16న అరెస్టు చేసి వారి నుంచి15.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారి ద్వారా తెలుసుకున్న సమాచారంతో గంజాయిని పట్టణానికి చేరవేస్తున్న ప్రధాన నిందితులపై నిఘా పెట్టి ఒడిశా రాష్ట్రానికి చెందిన పొట్టంగి రీజియన్ పనసర పాడు చెందిన జెట్టి సీతారాం, లక్ష్మణరావులను బొబ్బిలి పట్టణంలో గంజాయి అంజేసేందుకు రాగా శుక్రవారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.


ఏటీఎం కార్డు మార్చి నగదు అపహరణ

గజపతినగరం: స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఏటీఎం కార్డు మార్చి రూ.40వేలు దోచుకున్నారని గజపతినగరంలోని దిగవ వీధికి చెందిన శనపతి ప్రసాద్ వాపోయాడు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను మోసపోయిన తీరును తెలియజేశాడు. రూ.40వేలు జమ చేసేందుకు స్టేట్ బ్యాంక్‌కు వెళ్లి, జమ చేసిన తరువాత పక్కనే ఉన్న ఏటీఎం వద్దకు వెళ్లి పిన్ జనరేషన్ కోసం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులను అడిగానని చెప్పాడు. ఈ నేపథ్యంలో వారు నగదు బ్యాలెన్స్ చూస్తూ, పిన్ జనరేషన్ చేస్తున్నట్లు నటించి వారి ఏటీఎం కార్డును తనకు ఇచ్చి, తన కార్డును వారు తీసుకు వెళ్లి పోయారని తెలిపాడు. తరువాత నగదు చెక్ చేసుకోగా తన ఖాతాలో ఉండాల్సిన రూ.40వేలు రామభద్రపురంలో విత్ డ్రా చేసినట్లు బ్యాంక్ సిబ్బంది తెలిపారని చెప్పాడు. దీంతో మోసపోయానని తెలుసుకుని గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని వివరించాడు.

నలుగురు ఎస్సైలకు బదిలీ

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఎస్.భాస్కరరావును ఎస్.కోట, ఆర్.నరసింహమూర్తిని రాజాం టౌన్కు, బి.సురేంద్రనాయుడు, వి.లక్ష్మీప్రసన్నకుమార్‌లను విజయనగరం వన్ టౌన్‌కు బదిలీ చేశారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే



పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డేను ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన పలువురు సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. వ్యక్తిగత, శాఖాపరమైన వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఏవీ.లీలారావు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹108	₹186	₹196

పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మొక్కలు నాటుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యతగా గుర్తించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటిన ఆయన ప్రపంచం ఆధునీకరణ పేరుతో ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, చీపురుపల్లి జెడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ టూరిజం బోర్డ్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, సర్పంచ్ యశోద, ఎం.అప్పలరమణ, దేముడు, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కలే కీలకం

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం: పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కోట జంక్షన్ నుంచి చేపట్టిన వనమహోత్సవ ర్యాలీని ఆయన జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమల రావు, ఇతర అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్న ఈ ర్యాలీ కోట నుంచి మూడు లాంతర్లు, గంటస్తంభం, న్యూపూర్ణ జంక్షన్ మీదుగా రాజీవ్ స్టేడియం వరకు సాగింది.



వనమహోత్సవం ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ర్యాలీని ప్రారంభించిన అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్న ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి నెల రోజులపాటు అన్ని ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

అలవెన్స్ రద్దు తగదు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఈ నెల నుంచి నిలిపివేసిన అలవెన్స్‌ను పునరుద్ధరించాలని, ఇతరత్రా బకాయి బిల్లులను సకాలంలో చెల్లించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయనగరం ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఆందోళన చేసింది. అలవెన్స్ విధానాన్ని పునరుద్ధరించి, ఎరియర్స్ బిల్లులు, సిక్ లీవుల బిల్లులు, రిటైర్ ఉద్యోగుల సెటిల్మెంట్స్, ఏఏఎస్‌ల ఎరియర్స్ తదితర బకాయి బిల్లులు సకాలంలో చెల్లించాలని యూనియన్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫిల్, డిపో అధ్యక్షుడు బి.రామారావు, డిపో కార్యదర్శి కె.చంద్రమౌళి, ఉద్యోగులు పాల్గొన్నారు.



డిపో ఎదుట నిరసనలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యకర్తలు

ఎంఎస్పీలకు బదిలీ కౌన్సెలింగ్

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ పోలీసు(ఎంఎస్పీ)లకు ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి, వారు కోరుకున్న చోటుకు బదిలీ చేస్తూ, ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న ఎంఎస్పీలకు వారి వ్యక్తిగత, కుటుంబ, ఆరోగ్యపరమైన సమస్యలను, భాగస్వామి ఉద్యోగాలను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యం కల్పిస్తూ బదిలీలు చేపట్టారు. అంతేకాకుండా, ఈ బదిలీల్లో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మ్యూచువల్ బదిలీలకు కూడా ఎస్పీ అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన మహిళా సంరక్షణ పోలీసుల సీనియారిటీ ప్రాతిపదికన ఒక్కొక్కరినీ పిలిచి, వారితో మాట్లాడి, సమస్యలను విని, వాటిని పరిష్కరించే దిశగా వారు కోరుకున్న చోటుకు బదిలీ చేశారు. వివిధ సచివాలయాల్లో ఏర్పడుతున్న ఖాళీల వివరాలను స్క్రీన్‌పై చూపిస్తూ, వారు కోరుకున్న చోటుకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా బదిలీ చేయడంతో ఎంఎస్పీల నుంచి హర్షం వ్యక్తమైంది. కౌన్సెలింగ్ ప్రక్రియలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఏవీ.లీలారావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంరక్షణ పోలీసుల బదిలీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాత బస్ స్టాండ్ దగ్గర గల ఆర్‌సీఎం సెయింట్ పీటర్స్ స్కూల్ నుంచి కలెక్టరేట్ వరకూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సాగిన అవగాహనా చైతన్య ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ కేవలం లైంగిక కార్యకలాపాల ద్వారా మాత్రమే ఇతరులకు సంక్రమిస్తుందని, కలిసి భోజనం చేయడం వల్లగానీ, కలిసి తిరగడం వల్ల గానీ, కరచాలనం వల్ల గానీ సంక్రమించదని వివరించారు. వ్యాధి ఎలా వ్యాపి చెందుతుంది? రాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ ర్యాలీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. 5కె రెడ్ రన్ మారథాన్ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎం. వినోద్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డా.పీఎల్ రఘుకుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతి అందజేత

5కె రెడ్ రన్ మారథాన్‌లో పురుషుల విభాగంలో మొదటి బహుమతి ఎస్‌వీ డిగ్రీ కళాశాల విద్యార్థి జి.గౌరీశంకర్, రెండవ బహుమతిని ఎస్.నరేంద్ర (ఎంఆర్ఎస్ఏవీఎస్ కళాశాల), బాలిక విభాగంలో మొదటి బహుమతి ఎస్‌వీ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.రేణుక, రెండవ బహుమతి జి.జె.కళాశాల విద్యార్థిని అధికారి లలిత, ట్రాన్స్‌జెండర్స్ విభాగంలో మొదటి బహుమతి ఎస్‌వీటీ జూనియర్ కాలేజ్ విద్యార్థి మేకల నరేష్, రెండవ బహుమతి రాజీవ్ గాంధీ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థి గౌడు.రమేష్ గెలుపొందారు. మొదటి బహుమతిగా రూ.7వేలు, రెండవ బహుమతిగా రూ.4 వేలను రెండవ అదనపు జిల్లా జడ్జి విద్యార్థులకు అందజేశారు.

మడ్డువలసలో చిక్కుకున్న మత్స్యకారులు

- పదిగంటల పాటు గంగమ్మ ఒడిలో నిరీక్షణ
- ఫోన్ సమాచారంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- క్షేమంగా ఒడ్డుకు చేరుకున్న నలుగురు మత్స్యకారులు
- ఊపిరి పీల్చుకున్న మత్స్యకార కుటుంబాలు, అధికారులు



పడవల సహాయంతో ఒడ్డుకు చేరుతున్న మత్స్యకారులు

వంగర: మండల పరిధిలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో నలుగురు మత్స్యకారులు శుక్రవారంచిక్కుకుని దాదాపు పది గంటల తరువాత బయటపడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మగ్గూరు గ్రామానికి చెందిన సూరిమల్లి రాజు, సూరిమల్లి శ్రీను, సూరిమల్లి చిన్న, గుంట్రెడ్డి పోలి ఎప్పటి లాగానే శుక్రవారం మడ్డువలస సాయిబాబా గుడి వెనుక భాగంలో సంజీవని కొండను ఆనుకుని ప్రాజెక్టులో చేపల వేట చేసేందుకు వేకువజామున 4.30 గంటల సమయంలో ప్రాజెక్టులోకి దిగారు. చీకటిగా ఉండడంతో కొంతదూరం వెళ్లేసరికి దారి కనిపించకపోగా వారి పడవల చుట్టూ గుర్రపుడెక్క చేరింది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 2,500 క్యూసెక్కుల వరద నీరు రావడంతో ఆ నీటితోపాటు గుర్రపుడెక్క వచ్చి పడవల చుట్టూ చేరగా పడవలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఏం చేయాలో తెలియక ఉదయం 7గంటల సమయంలో కుటుంబసభ్యులకు తమ వద్ద ఉన్న ఫోన్ల ద్వారా మత్స్యకారులు సమాచారం అందించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న మత్స్యకార కుటుంబాలు ఆందోళనతో ప్రాజెక్టు వద్దకు పరుగులు తీశాయి. ప్రాజెక్టు అధికారులు, వంగర పోలీసులకు ఉదయం 8 గంటల సమయంలో సమాచారం అందించారు. వారంతా 9 గంటల సమయంలో ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేశారు. ఎప్పటికప్పుడు ప్రాజెక్టులో ఉన్న మత్స్యకారుల క్షేమ సమాచారాన్ని ఎస్సై షేక్ శంకర్, ప్రాజెక్టు డీఈ పి.అర్జున్, ఏఈ నితిన్‌లు తెలుసుకున్నారు.

ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేసి..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు వద్ద రెండు గేట్లు ఎత్తివేసి పెద్ద ఎత్తున గుర్రపుడెక్కను గేట్ల ద్వారా తొలగించారు. దీంతో మత్స్యకారుల చుట్టూ పేరుకుపోయిన గుర్రపుడెక్క నెమ్మదిగా గేట్లవైపు నీటితో పాటు రావడంతో నలుగురు మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కుటుంబ సభ్యులు వారిని చూసి కన్నీటిపర్యంతరమయ్యారు. ఈ సందర్భంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు మాట్లాడుతూ చేపల వేట చేసే సమయంలో తమ చుట్టూ గుర్రపుడెక్క పేరుకుపోవడంతో పడవలు ముందుకు కదలలేదని, ఏమై పోతామోనని భయపడ్డామని చెప్పారు. తమ వద్ద సెల్‌ఫోన్ ఉండడంతో క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు కుటుంబసభ్యులు, అధికారులకు చేరవేయగలిగామన్నారు. గంగమ్మ ఒడిలో పది గంటల పాటు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం గడిపామని చెప్పారు. సంఘటనా స్థలంలో తహసీల్దార్ ధర్మరాజు, డీటీ బూరాడ సుందరరావు, ఆర్ఐ జామి మురళి, వీఆర్వో రాజు, ప్రాజెక్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



రైలు ప్రమాదంలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌లో శుక్రవారం రైలు ఢీకొని సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. దీనిపై రైల్వే పోలీసులు మాట్లాడుతూ మృతుడి శరీరంపై లైట్ పింక్ కలర్ టీ షర్ట్, గ్రీన్‌కలర్ గడుల లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు తెలిపారు.

మార్బుల్స్ పడి యువకుడు..



శశికుమార్ మృతదేహం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన నందమూడి శశికుమార్ (24) మార్బుల్స్ పలకపడి మృతిచెందాడు. శుక్రవారం రాజాంలో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గృహనిర్మాణానికి అవసరమైన మార్బుల్స్‌ను స్థానిక చీపురుపల్లి రోడ్డు నుంచి లగేజీ వ్యాన్‌లో తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో బొబ్బిలి జంక్షన్ సమీపంలోకి వ్యాన్ రాగానే రోడ్డుపై ఏర్పడిన గొయ్యి కారణంగా వ్యాన్ అదుపుతప్పి అందులోని మార్బుల్స్‌కు కట్టిన తాడు తెగిపోవడంతో ఒక్కసారిగా అందులో ఉన్న శశికుమార్‌తోపాటు మరో ముగ్గురిపై అవి పడ్డాయి. ఈ ప్రమాదంలో మార్బుల్స్ కింద చిక్కుకున్న శశికుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి పలకలను తొలగించి తీవ్రగాయాల పాలైన శశికుమార్‌ను రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలిసి ఆస్పత్రి వద్దకు చేరుకున్న గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య చందనతో పాటు కుమార్తె ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి మృతుని తండ్రి శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి..



పాముకాటుతో మృతి చెందిన కొమ్ము కృష్ణ

గుర్ల: మండలంలోని నడుపూరు గ్రామానికి చెందిన కొమ్ము కృష్ణ (54) పాముకాటుతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మూడు రోజుల క్రితం తెలవారు జామున వరి చేనులో నీరు తోడడానికి కృష్ణ వెళ్లాడు. పొలం గట్టుపై పాము కరవడంతో కుటుంబసభ్యులకు సమాచారం తెలియజేసి వారి సహాయంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నానికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయిందని కుటుంబసభ్యులు వాపోయారు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు సంతోష్ ఉన్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సై పి.నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూలకోసం వెళ్లి మరో వ్యక్తి..



చెరువులో పడి ప్రాణాలు కోల్పోయిన రమణ

శృంగవరపుకోట: పట్టణంలోని మునసబువీధికి చెందిన సోమాదుల రమణ(48) కలువ పూలు కోసుకుని వస్తానని, శ్రావణశుక్రవారం పూజలకు అమ్ముకోవచ్చని ఇంటి వద్ద చెప్పి గురువారం ఉదయం వెళ్లాడు. రాత్రయినా ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబసభ్యులు ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో అంతా కలిసి వెదుకులాట ప్రారంభించారు. పట్టణానికి సమీపంలో ఉన్న జగన్నాథ సాగరం చెరువు వైపు వెళ్లిన వారు ఒడ్డున రమణ బట్టలు ఉండటంతో చెరువులో గాలించారు. చెరువులో రమణ శవమై తేలాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పూలు అమ్ముకుందామని వెళ్లి ప్రాణం దక్కకుండా పోయాడంటూ భోరుమన్నారు. పూలు కోసమని చెరువులోకి దిగిన తన తమ్ముడు రమణకు ఈత రాకపోవటం వల్ల మునిగిపోయి చనిపోయి ఉంటాడని సోదరుడు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.కోట ఏఎస్సై టి.వి.రమణ కేసు నమోదు చేశారు.